
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



పశ్చిమ గోదావరి

జిల్లా వార్తలు

3

శనివారం 17 ఆగస్టు 2024

భీమవరం ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 35.0 కనిష్ఠం : 26.0

తణుకు : 34.0 - 26.0



28న మాధవాయిపాలెం రేవు పాట

ప్రారంభ ధర రూ.2.97 కోట్లు

నరసాపురం, రూరల్, ఆగస్టు 16: మాధవాయిపాలెం రేవు పాట ఈనెల 28న నిర్వహించనున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పాటకు నోటిఫికేషన్ ఇవ్వడం ఇది నాల్గోవ సారి. ఈసారి పాట ప్రారంభ ధరను రూ. 2,97,83,217గా నిర్ణయించారు. గత మూడు సార్లు రూ.3.61 కోట్లుగా పెట్టి పాటకు నోటిఫికేషన్ ఇచ్చారు. అయితే పాటదారులెవ్వరూ ముందుకు రాలేదు. దీంతో ధర తగ్గించి నాల్గోవసారి నిర్వహిస్తున్నారు. శనివారం నుంచి టెండర్ షెడ్యూల్ ఫారాలు విక్రయించనున్నారు. షెడ్యూల్ ధర రూ 2వేలు, ఇది కాకుండా 240 పన్ను చెల్లించాల్సి ఉంటుంది. కొనుగోలు చేసిన షెడ్యూళ్లను ఈనెల 28 వరకు స్వీకరిస్తారు. ముందుగా బహిరంగ వేలం పాట నిర్వహించి, ఆ తరువాత సీక్రెట్ టెండర్లు తెరుస్తారు. ఈరెండింటిల్లో ఎవరూ హెచ్చు మొత్తంలో పాడుకుంటే వారికి రేవు నిర్వహణ బాధ్యతల్ని అప్పగిస్తామని ఇన్‌చార్జి ఎంపీడీవో వీరభద్రరావు తెలిపారు.



• శ్రావణలక్ష్మీ..నమోసుత్తే

శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా వరలక్ష్మి వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి ప్రతిమను అలంకరించి పూజ అనంతరం మహిళలకు వాయినాలు అందించారు. అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. చిత్రంలో ప్రత్యేక అలంకరణలో కాళ్ళ మండలంలోని కోమటిగుంటలో దుర్గాదేవి అమ్మవారు



పాలకొల్లులో అన్న క్యాంటీన్ ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి నిమ్మల

రూ.15లకే మూడు పూటలా భోజనం

అట్టహాసంగా అన్న క్యాంటీన్లు ప్రారంభం

5

నేడు ప్రైవేటు ఆస్పత్రుల బంద్

కోల్‌కతా ఘటనలకు నిరసనగా ఐఎంఏ పిలుపు

భీమవరం క్రైం/తణుకు/ఆకివీడు, ఆగస్టు 16 : కోల్‌కతా ఆర్జీకర్ ప్రభుత్వ వైద్యకళాశాల బోధనాసుపత్రిలో ఈ నెల 9న పోస్ట్‌గ్రాడ్యుయేషన్ ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం, హత్య, తదనంతరం ఆస్పత్రిలో విచ్ఛిన్నకర శక్తుల విధ్వంసాలను నిరసిస్తూ శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6గంటల వరకు జిల్లాలోని అన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లో 24గంటల పాటు అన్నిరకాల వైద్యసేవల బంద్‌కు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) పిలుపునిచ్చింది. ఈ మేరకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ భీమవరంశాఖ అధ్యక్షులు డా.జి బాలకృష్ణరాజు, కార్యదర్శి శంకర్‌కుమార్‌వర్మ, రాష్ట్ర యాక్షన్ కమిటీ సభ్యురాలు డా.ఎంవి స్వరాజ్యలక్ష్మీ, ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ కలిదిండి మహేష్‌వర్మ, తణుకు ఐఎంఏ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కె.ఆనంద్, ఎంవీ సుబ్బ రాజు తెలిపారు. అత్యవసర వైద్యసేవలు మినహా మిగతా అన్నిరకాల వైద్యసేవలను నిలిపివేస్తారని వివరించారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 1350 ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులు, చిన్నపాటి ఆస్పత్రులు, క్లినిక్‌లు, నర్సింగ్ హోంలు ఉన్నాయని తెలిపారు. సాధారణ విధులకు ఆటంకం లేకుండా ప్రభుత్వాస్పత్రుల వైద్యులు బంద్‌కు సంఘీభావాన్ని తెలియజేస్తారన్నారు. ప్రభుత్వ స్పందనను బట్టి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. వైద్యవృత్తిలో పేట్రేగుతున్న హింస, దాడుల్ని అరికట్టేందుకు వైద్యులు అందరూ స్వచ్ఛందంగా నిరసన కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని వారు కోరారు. మృతి చెందిన జూనియర్ డాక్టర్ కుటుంబానికి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని, డాక్టర్లపై హింసకు వ్యతిరేకంగా రూపొందిన చట్టాన్ని కేంద్రం పకడ్బందీగా అమలు చేయాలన్నారు.

దాతృత్వం దండగేనా!

పురపాలక సంఘం పరిధిలో దాతలు పెద్ద మనస్సుతో ఇచ్చిన కోట్లాది రూపాయల ఖరీదు చేసే స్థలాలు నిరుపయోగంగా ఉన్నాయి. ఒకప్పుడు మంచి మనసుతో సమాజ శ్రేయస్సుకు దాతృత్వంతో విరాళంగా ఇచ్చినా వినియోగించుకోవడంలో పురపాలకసంఘం విఫలమైంది. ఇలా పట్టణంలో సుమారు వంద కోట్ల రూపాయలు ఖరీదు చేసే స్థలాలు కంపోస్టు యార్డుగానూ, చిట్టడవులుగానూ మారాయి.

- దాతలు ఇచ్చిన స్థలాల్లో కంపోస్టు యార్డ్
- మరికొన్ని చోట్ల చిట్టడవులు
- పురపాలక అలసత్వం
- కోట్లాది రూపాయల ఆస్తులు వృథా

పాలకొల్లు/ పాలకొల్లు రూరల్, ఆగస్టు 16: పట్టణ పరిధిలో భీమవరం ప్రధాన రహదారికి చేర్చి స్థానిక పట్టణ పోలీసు స్టేషన్ ఎదురుగా పీఆర్‌ఎంవీ ఎంహెచ్‌వీ స్కూలు ఉండేది. సుమారు ఐదారు దశాబ్దాలకు ముందు బంగారు రామారావు, మాచేపల్లి వెంకటరత్నం అనే దాతలు ఉన్నత పాఠశాల నిర్మాణం నిమిత్తం స్థలాన్ని ఉచితంగా ఇచ్చారు. అయితే సుమారు పదిహేనేళ్ళ క్రితం ప్రధాన రహదారి పక్కనే ఉన్న పాఠశాలలు తొలగించి ఆ వెనకనే ఉన్న పాఠశాల గ్రౌండ్‌లో నూతన భవనం నిర్మించారు. అప్పటి నుంచి ప్రధాన రహదారి పక్కన ఉన్న ఖాళీ స్థలం నిరుపయోగంగా ఉంటుంది. ఆ స్థలంలో కొంత మేర కంపోస్టు యార్డు కింద వినియోగిస్తుండగా మిగిలిన స్థలంలో చెట్లు పెరిగి చిట్టడివిలా మారింది. ఇప్పటి మార్కెట్ ప్రకారం ఆ స్థలం విలువ రూ.25 కోట్లు పైబడి ఉంటుంది. అందులో ఇప్పటికి ఏ విధమైన నిర్మాణాలు చేపట్టలేదు. దాతలు మంచి హృదయంతో ఇచ్చినప్పటికి స్థలం సుమారు 20 సెంట్లు స్థలం ఖాళీగా ఉండటం పట్ల పట్టణ ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. దాతృత్వం దండగేనా అని వ్యాఖ్యానిస్తున్నారు. పట్టణ ప్రధాన రహదారికి చేర్చిఉన్న ఈ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ వంటివి నిర్మిస్తే పురపాలకసంఘంకు ఆదాయం సమకూరేది.

◆ పట్టణ పరిధిలోని పెనుమదం రోడ్డులో పశువైద్యశాల నిర్మాణానికి అర్ధశతాబ్దానికి ముందు దాతలు సుమారు ఎకరం స్థలం విరాళంగా ఇచ్చారు. అందులో కొంత మంది డాక్టర్ నివాసంగా భవనం నిర్మించి మరికొంత స్థలంలో పశువైద్యశాల ఏర్పాటు చేశారు. 60 సెంట్లు స్థలంలో పచ్చిక గడ్డి పెంచి పశువుల ఆసుపత్రికి వచ్చిన మూగ జీవాలకు ఆహారం ఏర్పాటు నిమిత్తం దాతలు స్థలాన్ని కేటాయించారు. అయితే ఆ స్థలాన్ని ఇపుడు పురపాలక సంఘం డంపింగ్‌యార్డుగా మార్చారు. దీంతో దాతృత్వం దండగగా మారింది. పాలకొల్లుపట్టణంలోని బ్రాడిపేట బైపాస్‌రోడ్డు సమీపంలో నందుల బుచ్చిరామయ్య అనే దాత 80 సెంట్లు పంట భూమిని పురపాలక సంఘానికి విరాళంగా ఇచ్చారు. ఆ పంట ద్వారా వచ్చిన ఆదాయం పురపాలకసంఘ పాఠశాలలో చదివే మెరిట్‌విద్యార్థులకు స్కాలర్ షిప్‌గా ఇవ్వాలని సదరు దాత పొలాన్ని పురపాలకసంఘానికి ఇచ్చారు. అయితే మూడు దశాబ్దాలుగా పొలం మీద వచ్చిన ఆదాయంతో స్కాలర్ షిప్‌లు ఇచ్చిన దాఖలాలు లేవు. కాగా గత ఐదారేళ్ళుగా పంట భూమి కాస్త బీడు భూమిగా మారింది. సమీప భూముల్లో లే అవుట్‌లు వేయడంతో అక్కడ సాగు చేసే అవకాశం లేదు. ఇపుడు ఆ భూమి ధర కోట్లలో ఉంటుంది.

◆ పురపాలకసంఘ కార్యాలయ సమీపంలో బందుల దొడ్డికి కేటాయించిన స్థలం అన్యాక్రాంతం అయ్యింది. పట్టణంలో విచ్చలవిడిగా సంచరిస్తే పశువులను బంధించడానికి ఏర్పాటు చేసిన బందుల దొడ్డి మూడు దశాబ్దాల ముందే మూత పడటంతో అక్కడ షాపింగ్ వెలిసింది. పట్టణంలో ఇలావందల కోట్ల ఖరీదు చేసే దాతల స్థలాలు నిరూపయోగంగా ఉన్నాయి.





ప్రభుత్వ పశువుల ఆసుపత్రికి విరాళంగా ఇచ్చిన స్థలం.. బీఆర్‌ఎంవీ స్కూలు పాత భవనాలు తొలగించిన స్థలం

• దాత వెనక్కు తీసుకోవచ్చు..

దాత ఆశయం నెరవేరకుంటే విరాళంగా ఇచ్చిన ఆస్తిని వెనుకకు తీసుకునే అవకాశం చట్టప్రకారం దాత లేదా దాతల వారసులకు ఉంది. ఇపుడు దాతల వారసులు ఆ విధంగా ముందుకువెళితే వందల కోట్ల రూపాయలు ఖరీదు చేసే ఆస్తులు పురపాలకసంఘానికి దగ్గకుండా పోతాయని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా కోట్లాది రూపాయలు ఖరీదు చేసే స్తలాలను పురపాలక సంఘాలు సద్వినియోగించుకోవాలని పురపాలక సంఘం ప్రజలు కోరుతున్నారు.

దుంపగడపకు అనారోగ్యం

- జ్వరం, తలనొప్పి, కాళ్లు వాచిపోవడం
- రక్తపరీక్ష, కిడ్నీ, లివర్ పరీక్షలలో ఎటువంటి తేడా లేదని నిర్ధారణ
- ఒకరికి వస్తే మరొకరికి సోకుతున్న వైనం
- గ్రామంలో పర్యటించిన అడినషనల్ డీఎంహెచ్‌వో

అడుగు పడడం లేదు.. చెయ్యి రావడం లేదు.. వేళ్ళు కదలడం లేదు.. జాయింట్‌లు వద్ద నొప్పి.. కాళ్ళు వాచిపోయి... తగ్గకుండా రోజులు తరబడి జ్వరం-102 ఉండటం, రొంప, దగ్గు, తలనొప్పి.. ఇది దుంపగడప గ్రామంలో జనం పరిస్థితి..

ఆకివీడు రూరల్ ఆగస్టు 16 : గ్రామంలో జనం పై లక్షణాలతో ప్రైవేటు ఆసుపత్రులులో చికిత్సలు పొందుతుండగా, మరికొంతమంది ఇంటివద్దే మందులు వాడుతున్నారు. 15 రోజులుగా గ్రామంలో అనారోగ్య పరిస్థితులు నెలకొన్నాయి. కాళ్ళు వాచిపోవడంతో కిడ్నీ, లివర్ టెస్టులు చేయించినా వాటిలో ఎటువంటి తేడాలు ఉండటం లేదు. సుమారు ఏడువేల మంది గ్రామ జనాభా ఉన్నది. గ్రామంలో సుమారు 30 శాతం మందికి ఈ రకమైన అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నారు. గతంలో కరోనాతో ఎక్కడాలేనన్ని మరణాలు ఈగ్రామంలోనే సంభవించాయని, డెంగీ వ్యాధితో కూడా మరణాలు సంభవించగా, అనేక మంది ఆసుపత్రులు పాలయ్యారని గ్రామస్థులు వాపోతున్నారు. 2020 నుంచి గ్రామంలో వివిధ రూపాలలో వ్యాధులు ఎక్కువగా ప్రబలుతున్నాయని తెలిపారు. గ్రామంలో ప్రతిఏటా ఏదోరకమైన వ్యాధి విజృంభిస్తున్నదని గ్రామస్థులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈవ్యాధి ఇంటిలో ఒకరికి సోకితే అందరికి సోకుతున్నదని తెలియజేస్తున్నారు.

ఇది వైరల్ ఫీవర్..

అడిషనల్ డీఎంఅండ్ హెచ్‌వో భానునాయక్

దుంపగడప, కుప్పనపూడి, అజ్జమూరు గ్రామాలను అడిషన్ డీఎంఅండ్ హెచ్‌వో భానునాయక్ పర్యటించారు. ఫీవర్ సర్వే ఏవిధంగా ఉందని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జ్వరం తగ్గిన తరువాత కాళ్ళనొప్పులు, వాపులు కొద్దిరోజులుంటాయని, కంగారుపడవద్దని ఇది వైరల్ ఫీవర్ అని ప్రజలకు తెలియజేయాలని సిబ్బందికి తెలిపారు. పారిశుద్ధ్యం, ఆహారం, నాణ్యమైన తాగునీరు తీసుకునేలా ప్రజలను చైతన్య పరచాలని సూచించారు. గ్రామంలో పెదకాపవరం పీహెచ్‌సీ వైద్యులు రమేష్ ఫీవర్ సర్వేలో పాల్గొన్నారు.

వారం రోజులు నుంచి జ్వరం, ఒళ్ళు నొప్పులతో బాధపడుతున్నా, అడుగుతీసి అడుగు వెయ్యలేకపోయా, మంచం మీద నుంచి ఇంట్లో వాళ్ళ సాయంతో లేపుతున్నారు. ప్రైవేటు ఆసుపత్రి డాక్టర్‌కు చూపించుకుని చికిత్స పొందుతున్నా, బాగా నీరసంగా ఉంటున్నది.



అడుగు వెయ్యలేకపోయా

పీజీ ధనలక్ష్మీ, దుంపగడప



కాళ్ళు వాచి పోయాయి

పి.దేవి, దుంపగడప

రోజురోజుకు కాళ్ళు వాపు పెరిగిపోతున్నది. చికిత్స పొందుతున్నా. కనీసం కాలకృత్యాలకు వెళ్ళాలంటే ఇబ్బంది పడుతున్నా, జాయింట్‌లు వాచిపోయాయి, విపరీతమైన నొప్పి. మనిషి తోడు లేకుండా ఏపని జరగడం లేదు. జ్వరం ఎక్కువగా ఉంటున్నది.

జేసీగా రాహుల్ కుమార్ రెడ్డి బాధ్యతల స్వీకరణ



భీమవరం టౌన్, ఆగస్టు 16: జిల్లా జాయింట్ కలెక్టర్‌గా టి.రాహుల్ కుమార్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన సర్వీస్ ప్రారంభంలో అసిస్టెంట్ కలెక్టర్‌గా పూర్వపు పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో పనిచేశారు. అనంతరం శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో సబ్ కలెక్టర్‌గా పనిచేస్తూ పదోన్నతిపై నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్‌గా వెళ్లారు. అక్కడి నుంచి ఎన్నికల అనంతరం శ్రీకాకుళం జిల్లా సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా బదిలీపై వెళ్ళగా, అక్కడ రెండు నెలల పనిచేసిన అనంతరం ఇటీవల జరిగిన ఐఏఎస్ ల బదిలీలలో జిల్లాకు జాయింట్ కలెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శుక్రవారం నాడు జేసీగా బాధ్యతలు చేపట్టారు.

అనంతరం జేసీ మాట్లాడుతూ వ్యవసాయ, అనుబంధ రంగాలను పక్కా ప్రణాళికతో అభివృద్ధి చేయడానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. రైతులకు ఇబ్బంది లేని విధంగా మద్దతు ధరతో ధాన్యం కొనుగోళ్లకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి రైతు ఈ-పంట రైతు నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని, పకృతి వైపరీత్యాల సమయంలో ప్రభుత్వ సహాయం అందజేయడానికి సులువుగా ఉంటుందని తెలిపారు. వ్యవసాయ అధికారులు ఈ-పంట నమోదులో వాస్తవ సాగుదారులను మాత్రమే నమోదు చేయాలని అన్నారు. జేసీకి రెవెన్యూ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

విజిలెన్స్ డీఎస్పీ వెంకటేశ్వరరావుకు ఇండియన్ పోలీస్ మెడల్



ఆకివీడురూరల్ ఆగస్టు 16 : ఆకివీడు మండలం అజ్జమూరు గ్రామానికి చెందిన సింగులూరి వెంకటేశ్వరరావు స్వాతంత్ర్య దినోత్సవం రోజు ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు చేతుల మీదుగా ఇండియన్ పోలీసు మెడల్ స్వీకరించారు. ఆయన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా విజిలెన్స్ డీఎస్పీగా పనిచేశారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన ఆయన 1991లో ఎస్ఐగా, 2008లో సీఐగా సాధారణ, ఏసీబీ శాఖలలో పనిచేశారు. 2020లో డీఎస్పీగా పదోన్నతి పొంది ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఏసీబీ డీఎస్పీగా పనిచేశారు. ప్రస్తుతం విజిలెన్స్ డీఎస్పీగా తిరుమలలో విచారణ బృందంలో ఉన్నారు.

ఏపీ నిట్‌లో నేడు స్నాతకోత్సవం



తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 16: ఏపీ నిట్ 6వ స్నాతకోత్సవానికి ముస్తాబైంది. ఈనెల 17న నిర్వహించే స్నాతకోత్సవాలకు ప్రాంగణంలోని రవీంద్ర భారతి ఆడిటోరియంలో అధికారులు ఏర్పాట్లు చేశారు. 2020-24 వరకు బీటెక్ పూర్తి చేసుకున్న 527 మంది విద్యార్థులకు పట్టాలు అందజేయనున్నారు. వీరితో పాటు రెండేళ్ల ఎంటెక్ కోర్సు పూర్తి చేసిన 15 మంది విద్యార్థులకు డిగ్రీలు, 25 మంది పరిశోధనా విద్యార్థులకు డాక్టరేట్ పట్టాలను అందజేయనున్నారు. ఆయా కోర్సుల్లో గ్రేడు పాయింట్లు సాధించిన 8 మందికి బంగారు పతకాలు అందజేయనున్నారు. ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరక్టర్ బీఎస్ మూర్తి అధ్యక్షతన నిర్వహించే కార్యక్రమానికి హిమాచల్ ప్రదేశ్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ బోర్డు ఆఫ్ గవర్నెన్సు ఛైర్మన్, ఐఐటీ అల్యుమిని కౌన్సిల్ ప్రెసిడెంట్ డాక్టర్ రవిశర్మ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

అర్హులు టీచరు ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

తణుకు, ఆగస్టు 16 : ఉమ్మడి తూర్పు, పశ్చిమ ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి నవంబరు 1వ తేదీలోగా కొత్త టీచరు ఓటరు నమోదు జాబితా తయారు కోసం అర్హులైన వారు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ అశోకవర్మ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సెకండరీ స్కూలు, జూనియర్ కాలేజీ, ప్రభుత్వ, ప్రవేటు ఐటీఐ, మోడల్ స్కూళ్లతో పాటు వివిధ విద్యా సంస్థల్లో మూడు సంవత్సరాలపాటు ఉపాధ్యాయులుగా పనిచేసిన వారు ఉపాధ్యాయ ఓటరుగా నమోదుకు అర్హులన్నారు.

తూర్పు గోదావరి జిల్లాలో ఉచిత ఇసుక స్టాక్

భీమవరంటౌన్, ఆగస్టు 16 : తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ఉసులుమర్రులో 5,603 మెట్రిక్ టన్నులు, పెండ్యాలలో 1,06,758 మెట్రిక్ టన్నులు, నిడదవోలు మండలం పందలపర్రులో 38,566 మెట్రిక్ టన్నుల ఇసుక స్టాక్ ఉందని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఆయా స్టాక్ పాయింట్లు వద్ద టన్నుకి రూ.270 లకు చెల్లించి ఉచిత ఇసుక పొందవచ్చన్నారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురంలో 29, 527మెట్రిక్ టన్నులు ఉందని టన్నుకి రూ 265 చెల్లించి పొందవచ్చు అని కలెక్టర్ తెలిపారు.

రైల్వే ప్రయాణికులకు అసౌకర్యం కల్పించవద్దు



తనిఖీ చేస్తున్న రైల్వే అధికారులు

ఏలూరు క్రైం, ఆగస్టు 16 : రైల్వే ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యాలు కల్పించినా సహించేది లేదని కఠిన చర్యలు తీసుకుంటామని విజయవాడ రైల్వే వాణిజ్య శాఖ అధికారులు హెచ్చరించారు. విజయవాడ డివిజన్ కమర్షియల్ మేనేజర్ ఎండీ ఆలీఖాన్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ల బృందం శుక్రవారం ఆకస్మికంగా ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. రైల్వే స్టేషన్‌లో బుకింగ్ కౌంటర్, క్యూఆర్ కోడ్‌ల ప్రదర్శన, పార్శిల్ ఆఫీస్, క్యాటరింగ్, వాటర్ వెడ్డింగ్ స్టాల్స్‌ను పరిశీలించారు. డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించాలని సూచించారు. అప్పుడే వచ్చి ఆగిన కోణార్క్ ఎక్స్‌ప్రెస్ ప్యాంట్రీ కార్‌ను పరిశీలించారు. పదార్థాల గడువు తేదీలు, ఆహార పదార్థాల పరిశుభ్రత, విక్రేతల గుర్తింపుకార్డు, వైద్య ధృవీకరణ పత్రాలు పరిశీలించారు. మేనేజర్ ఆలీఖాన్ మాట్లాడుతూ ప్రయాణికులతో మర్యాదగా నడుచుకోవాలని, నాణ్యమైన ఆహారపదార్థాలు విక్రయించాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

రేపు భీమవరం రైల్వే గేటు మూత

భీమవరం క్రైం, ఆగస్టు 16 : భీమవరం పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఉన్న 118 నెంబర్ రైల్వేగేటును ఈనెల 18వ తేదీ ఉదయం 7 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. గేటు మరమ్మతులు, రోడ్డు పనుల నిమిత్తం మూసి వేస్తున్నట్లు తెలిపారు. ఆ ఒక్క రోజు ప్రయాణికులు సహకరించాలని అధికారులు కోరారు.

విద్యారంగాన్ని చక్కదిద్దే చర్యలు చేపట్టాలి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ లక్ష్మణరావు



ఏలూరు అర్బన్, ఆగస్టు 16 :రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వపాలనలో విధ్వంసానికి గురైన విద్యారంగాన్ని కూటమి ప్రభుత్వం చక్కదిద్దే చర్యలు చేపట్టాలని కృష్ణాగుంటూరు జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు డిమాండ్ చేశారు. రెండు రోజులపాటు జరిగే ఎస్ఎఫ్ఐ రాష్ట్రస్థాయి సమావేశాలు శుక్రవారం ఏలూరు సీఐటీయు కార్యాలయంలో ప్రారంభమయ్యాయి. తొలిరోజు సమావేశాలకు ఎమ్మెల్సీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో చర్చించిన అంశాలను ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లెనిన్ పత్రికలకు తెలియజేశారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా విద్యారంగంలో అనేక లోటుపాట్లు ఉన్నాయని, ప్రైవేటు విశ్వ విద్యాలయాల స్థాపనకు అనుమతులను నిలిపివేయాలని, ప్రభుత్వ విశ్వ విద్యాల యాలను బలోపేతం చేయడానికి ఖాళీగా వున్న 5 వేల అధ్యాపక, అధ్యాపకేతర పోస్టులను భర్తీ చేయాలన్నారు. డిగ్రీ ఆన్‌లైన్ అడ్మిషన్ల విధానాన్ని, మేజర్, మైనర్ సబ్జెక్టులను రద్దు చేయాలని కోరారు.నూతన జాతీయ విద్యా విధానం వల్ల విద్యార్థులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, జీవో 72 ఉత్తర్వులను రద్దుచేయడంతో పాటు, ప్రైవేటు కళాశాలల్లో పీజీ విద్యార్థులకు ఫీజు రీఇంబర్స్‌మెంట్‌ను వర్తింప జేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల మనుగడను తీవ్రంగా దెబ్బతీసిన జీవో 117ను రద్దు చేయాలన్నారు.ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.ప్రసన్న, ఏ.అశోక్ మాట్లాడుతూ కోల్‌కతా మెడికల్ వైద్యురాలిపై జరిగిన హత్యాచారానికి నిరసనగా దేశవ్యాప్తంగా శనివారం వైద్యులు, వైద్య విద్యార్థులు జరప తలపెట్టిన బంద్‌కు ఎస్ఎఫ్ఐ సంపూర్ణ మద్దతునిస్తున్నట్టు వెల్లడించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు వి.ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

లో వోల్టేజ్.. కాలిన విద్యుత్ ఉపకరణాలు



తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 16: తాడేపల్లిగూడెం శేషమహల్ వెనుక భాగంలో విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ లోపంతో ఇళ్లల్లోని విద్యుత్ ఉపకరణాలు కాలిపోయాయి. విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌లో వచ్చిన సాంకేతిక లోపంతో ఏసీలు, ఫ్రిడ్జ్‌లు, బల్బులతో పాటు ఉపకరణాలు కాలిపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై విద్యుత్తు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

దత్తిరాజేరు, ఆగస్టు 16: గుర్తు తెలియని రైలు ఢీకొని ఒకరు మృతిచెందారు. జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ బి.ఈశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం తెల్లవారుజామున బలిరెడ్డి సురేష్ (26) విజయనగరం జిల్లా పెదమానాపురం వద్ద పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడని తెలిపారు. మృతుడిది పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం అని తెలిపారు. తన నాయనమ్మ స్వగ్రామమైన పెదమానాపురం వచ్చినట్టు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజపతినగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.



ఏలూరులో భోజనాలు వడ్డిస్తున్న ఎమ్మెల్యే చంటి, మేయర్ నూర్జహాన్, అప్పలనాయుడు



ఏలూరులో అన్న క్యాంటీన్ వద్ద సందడి



తణుకులో కార్మికులతో కలిసి అల్పాహారం తింటున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

బాబూ..చల్లగుండయ్యా!

పేదల కుడుపు నిండింది
అన్న క్యాంటీన్లు ప్రారంభం
రూ.5లకు అల్పాహారం, భోజనం
ఎక్కడికక్కడ తరలివచ్చిన పేదలు
కూటమి ప్రభుత్వానికి దీవెనలు

పేదోడి కడుపు నిండింది. శుక్రవారం వారి కల నెరవేరింది. తామెంతో ఆరాధించే ఆకలి తీర్చుకునే అన్న క్యాంటీన్లు మాయమైన ఐదేళ్ల తరువాత నేడు మళ్లీ తెరుచుకోవడంతో పేదల ఆనందానికి పట్టపగ్గాలు లేకుండా పోయింది. తొలిరోజే వెల్లువలా పేదలు ఎక్కడికక్కడ క్యాంటీన్లకు తరలివచ్చారు. అల్పాహారం, భోజనం భుజించి చంద్రబాబూ.. నువ్వు చల్లంగుండయ్యా.. అంటూ దీవించి మరీ వెళ్లారు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)



భోజనం చేస్తున్న దివ్యాంగుడు

మితిమీరిన అహంకారం, అధికార పగ్గాలు చేపట్టామనే శృతిమించిన ధీమా, ఇంకొకరికి పేరొస్తుందనే అసూయ, ద్వేషంతో ఐదేళ్ల క్రితమే అధికార పగ్గాలు చేపట్టిన జగన్ ప్రభుత్వం అప్పట్లో అన్న క్యాంటీన్లను ఏకపక్షంగా మూసివేసింది. ప్రతీరోజూ ఈ క్యాంటీన్‌నే నమ్ముకుని నాలుగు మెతుకులు తింటున్న పేదోడి నోట్లో మట్టి కొట్టింది. స్థానిక నేతలు పేరు మార్చి అయినా సరే క్యాంటీన్ కొనసాగించాలని సంకేతాలు పంపినా కుదరనే కుదరదంటూ అప్పటి సైకో ప్రభుత్వం ఛీకొట్టింది. పేదల వర్గమంటూ జబ్బలు చరచుకునే నేతలంతా ఏ ఒక్కరూ క్యాంటీన్ తెరిపించలేపోయారు. జగన్ ప్రభుత్వాన్ని జనం సాగనంపిన వేళ.. తిరిగి పగ్గాలు అందుకున్న కూటమి ప్రభుత్వం పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లను శుక్రవారం నుంచి ఆరంభించింది.



ఏలూరు అన్న క్యాంటీన్‌లో భోజనాలు చేస్తున్న దృశ్యం



ఉదయం అల్పాహారంతో ప్రారంభం

కూటమి ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఎక్కడా హడావుడి చేయకుండానే శుక్రవారం ఉదయం అల్పాహారంతో అన్న క్యాంటీన్లను ప్రారంభించారు. ఏలూరు జిల్లావ్యాప్తంగా ఆరు అన్న క్యాంటీన్లను శుక్రవారం నుంచి ఆరంభించాలని అనుకున్నా తొలిరోజు మాత్రం ఒక్క జంగారెడ్డిగూడెం మినహా నూజివీడులో ఒకటి, ఏలూరులో మరో నాలుగు అన్న క్యాంటీన్లను ఆరంభించారు. పశ్చిమ గోదావరి జిల్లాలో భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెంలో క్యాంటీన్లు ప్రారంభమయ్యాయి. ఏలూరు నగరంలో కలెక్టరేట్, ఆర్ఆర్ పేట, తంగెళ్ళమూడి, బాలాజి థియేటర్ సమీపంలో శుక్రవారం నిర్ణీత సమయంలోనే ఉదయం 7 గంటల నుంచే అల్పాహారాన్ని ఆరంభించారు. ప్లేటు ఐదు రూపాయలు చొప్పున ఇడ్లీ, లేదా పూరిని తొలినాడు అందించగలిగారు. మధ్యాహ్నం వేళ అన్నం, కూర, పప్పు లేదా సాంబారు, పెరుగు, పచ్చడి వడ్డించారు. అన్నిచోట్ల అన్న క్యాంటీన్లన్నీ ఉదయం నుంచి రాత్రి వరకు నిర్ణీత సమయంలో కిక్కిరిసిపోయాయి.

రుచిగా, శుభ్రంగా ఉన్నాయి



అన్నా క్యాంటీన్‌లో ఈరోజు మధ్యాహ్నం భోజనం చేశాను. రుచిగానూ, శుభ్రంగానూ ఆహార పదార్థాలు ఉన్నాయి. బంగాళా దుంప, టమాట కుర్మా, నిమ్మకాయ పచ్చడి, సాంబారు, పెరుగుతో రూ. 5లకే భోజనం చేశాను. చాలా సంతృప్తిగా ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి పేదలు అందరూ రుణ పడి ఉంటారు.

-బొబ్బాసి శ్రీను, ప్లంబర్, పాలకొల్లు

రెండు పూటలా తినే అవకాశం వచ్చింది



ఈరోజు ఉదయం ఇడ్లి, పూరి తీసుకున్నాను, సూపర్‌గా ఉంది. చట్నీ, కూర కూడా బాగున్నాయి. భార్య చనిపోవడంతో ఒంటరిగా ఉంటున్నాను. కుమార్తెలు ఇద్దరికి వివాహాలు చేశాను. చంద్రబాబు దయవల్ల రెండు పూటలా భోజనం చేసే అవకాశం మళ్లీ వచ్చింది. మహానుభావుడు మా..నిమ్మల రామానాయుడుకు రుణ పడి ఉంటాను.

-అప్పారావు, 21వ వార్డు పాలకొల్లు

వైసీపీ మా పొట్ట కొట్టింది..



కనీసం రెండుపూటలా కడుపు నింపుకునేందుకు గతంలో జేబులు చూసుకునేవాళ్లం. మళ్లీ అన్న క్యాంటీన్ ప్రారంభించడంతో మాకు ఆ పరిస్థితి ఉండదు. ఈ రోజు కడుపునిండా భోజనం చేశా. అన్న క్యాంటీన్లు సామాన్యులకు దేవాయాలు. వైసీపీ ప్రభుత్వం క్యాంటీన్లు మూసివేసి పొట్ట కొట్టింది. తిండి కోసం నానా అవస్థలు పడ్డాం.

- కె.మురళీ ,ఏలూరు

నిత్యం ఏలూరుకు జన తాకిడి

ఏలూరు నగరానికి ప్రతీరోజు వివిధ చికిత్సల నిమిత్తం, వ్యక్తిగత సమస్యల పరిష్కారం నిమిత్తం కార్యాలయాల్లో తగిన పనుల నిమిత్తం, చిన్నచితక వస్తువుల నిమిత్తం వేలాది మంది తరలివస్తారు. ఒకానొక అంచనా ప్రకారం ఏలూరు నగరానికి వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే సంఖ్య రోజుకి 11 వేల నుంచి 17 వేల వరకు ఉంటుందని అంచనా. రద్దీగా ఉండే ఏలూరులో నాలుగు అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేశారు. నిత్యం వందలాది మంది అర్జీలు ఇచ్చే నిమిత్తం కలెక్టరేట్‌కు తరలివస్తూనే ఉంటారు. దీనిని దృష్టిలో పెట్టుకుని అక్కడ కూడా అన్న క్యాంటీన్ ఆరంభించారు. అలాగే ఏలూరులో రద్దీ ప్రాంతం ఆర్ఆర్‌పేటలో, వ్యాపార సముదాయాల్లో పనిచేసే అల్పాదాయ గుమస్తాల సంఖ్య వందల్లోనే ఉంటుంది. వీరితోపాటు యాచకులు, కనీసం రోజూ ఒక ముద్దకు కూడా నోచుకోని అనాథలు, అభాగ్యులు మరెంతో మంది. వీరందరికీ కాస్త కడుపునింపే ప్రాంతం ఆర్ఆర్ పేటలోని అన్న క్యాంటీన్. దీంతోపాటు తంగెళ్ళమూడి, బాలాజీ థియేటర్ సెంటర్లలో క్యాంటీన్లు ఏర్పాటు చేశారు.

ఎక్కడికక్కడ కిక్కిరిశాయి

నూజివీడులో మంత్రి కొలుసు పార్థసారధి ప్రారంభించారు. ఉదయాన్నే అల్పాహారాన్ని మంత్రి స్వీకరించారు. పేదలకు కడుపు నింపడమే కాకుండా నాణ్యమైన ఆహారాన్ని అందించగలిగామనే సంతృప్తి తమ కూటమి ప్రభుత్వానికి కలుగుతుందన్నారు. పాలకొల్లు టాక్సీ స్టాండ్ సమీపంలో రాష్ట్ర జలవనరుల శాఖమంత్రి డాక్టర్ నిమ్మల రామా నాయుడు ప్రారంభించారు. పేదవారికి రుచిగా, శుచిగా తక్కువ ధరలకే భోజనం అందిస్తుంటే జగన్ కడుపు మండుతోందన్నారు. ఏలూరులో కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యే బడేటి చంటి క్యాంటీన్లను ప్రారంభించారు. పేదలతో కలిసి ఆహారం రుచి చూశారు.



తాడేపల్లిగూడెంలో అల్పాహారం స్వీకరిస్తున్న బొలిశెట్టి, బాబ్జి

పేదల కళ్లల్లో ఆనందం చూశాం : మంత్రి నిమ్మల

పాలకొల్లు అర్బన్ : రాష్ట్రంలో ఎంతోమంది పేదవారి కడుపులు నింపుతున్న అన్న క్యాంటీన్లను మూసి వేసి వైసీపీ ప్రభుత్వం వారి కడుపు కొట్టిందని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లులో ఆయన అన్న క్యాంటీన్‌ను ప్రారంభించి మాట్లాడారు. జగన్ బ్రిటిష్ పాలకుల కన్నా కఠినమైన చట్టాలను అమలు చేసి ప్రతిపక్షాలను అణిచి వేశారన్నారు. శుక్రవారం అన్న క్యాంటీన్లలో భోజనం చేసిన పేదల కళ్లల్లో ఆనందం చూశామన్నారు.

ప్రజల సంక్షేమమే మా బాధ్యత : మంత్రి పార్థసారధి

నూజివీడు : పేదల ఆకలిని తీర్చడమే అన్న క్యాంటీన్ల ఏర్పాటు లక్ష్యమని రాష్ట్ర గృహనిర్మాణ,సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. నూజివీడులో అన్న క్యాంటీన్ ప్రారంభించారు. ప్రజలకు స్వయంగా అల్పాహారాన్ని అందించారు. ప్రజలను సంతోషపరిచేలా వారి ఆకాంక్షలకు అనుగుణంగా సుపరిపాలన అందించడం కూటమి ప్రభుత్వం బాధ్యత అన్నారు.

పేదల కళ్లల్లో ఆనందమే లక్ష్యం : ఆరిమిల్లి

తణుకు : పేదల కళ్ళల్లో ఆనందమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. తణుకు సొసైటీ రోడ్డులో అన్న క్యాంటీన్ ఆయన ప్రారంభించారు. పేదలకు ఆయన స్వయంగా అల్పాహారం వడ్డించారు. కార్మికులతో కలసి అల్పాహారం తిన్నారు. క్యాంటీన్ ద్వారా రోజు సుమారు 350 పైగా బోజనాలు, టిఫిన్‌లు చేసేలా ఏర్పాట్లు చేశామన్నారు. వైసీపీ ప్రభుత్వం క్యాంటీన్లు మూసివేసినా తణుకులో 450 రోజులుకు పైగా, అత్తిలిలో 550 రోజుల పాటు దాతల సహకారంతో దిగ్విజయంగా కొనసాగించిన టీడీపీ నాయకులు ఒమ్మి రాంబాబు, బీమనాదుని సుబ్బారావు, ఆనాల ఆదినారాయణ, ఆల్లి సత్య నారాయణలను ఆరిమిల్లి సాలువాలతో సత్కరించారు.

వైసీపీ మాజీ మంత్రులు క్యాంటీన్‌లో తినాలి : బొలిశెట్టి

తాడేపల్లిగూడెం అర్బన్ : అన్న క్యాంటీన్లపై విమర్శలు గుప్పించిన మాజీ మంత్రులు కొట్టు సత్యనారాయణ, అంబటి రాంబాబు తదితరులు క్యాంటీన్‌లో భోజనం చేసి అప్పుడు విమర్శలు చేయాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ చురకలు అంటించారు. టీడీపీ ఇన్‌చార్జి వలవల బాబ్జితో కలసి తాడేపల్లిగూడెంలో క్యాంటీన్ ప్రారంభించారు. తన పుట్టిన రోజు సందర్భంగా ఒక పూటకు అయ్యే భోజన ఖర్చును పట్టణ మున్సిపల్ ఇన్‌చార్జి కమీషనర్‌కు అందజేశానన్నారు. వలవల బాబ్జి మాట్లాడుతూ క్యాంటీన్లు తెరిచిన వెంటనే పేదల కళ్లల్లో ఆనందం కనపడుతోందన్నారు.

ఎంతో ఆనందంగా ఉంది : అంజిబాబు

భీమవరం టౌన్ : పేదలకు కడుపునిండా భోజనం పెట్టే ఈ గొప్ప కార్యక్రమాన్ని ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. భీమవరంలో పాత బస్టాండ్ వద్ద అన్న క్యాంటీన్ కలెక్టర్ నాగరాణితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. బుధవారం మార్కెట్, పాత బస్టాండ్, జువ్వలపాలెం రోడ్డులో మూడు ప్రాంతాల్లో అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేశామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎనిమిది ప్రాంతాల్లో క్యాంటీన్లు ఏర్పాటు చేశామని వాటిలో మూడు క్యాంటీన్లను భీమవరంలో ప్రారంభించామన్నారు. మాజీ రాజ్యసభ సభ్యురాలు సీతారామలక్ష్మి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు, జనసేన జిల్లా అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరావు, ఎమ్మెల్యే, కలెక్టరు ప్రజలకు అల్పాహారం వడ్డించి ఆహార పదార్థాలను రుచి చూశారు.

మొదటి నెల జీతం విరాళం : బడేటి చంటి

ఏలూరుటూ టౌన్ : పేదవాడికి పట్టెడన్నం పెట్టే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్లు ప్రారంభించిందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, జనసేన ఇన్‌చార్జ్ రెడ్డి అప్పలనాయుడు నగర మేయర్ షేక్ నూర్జహాన్‌లు ఏలూరు నగరంలో క్యాంటీన్లు ప్రారంభించారు. ఆర్ఆర్ పేట వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద, తంగెళ్ళమూడి వంతెన, జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద, వన్‌టౌన్ రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ హాలు వద్ద ప్రారంభించారు. పేదలకు స్వయంగా వడ్డించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నక్యాంటీన్లు నిర్వహణకు దాతల సహకారం అవసరమన్నారు.తన మొదటి నెల జీతం రూ.లక్షా 25 వేలు విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించారు.



భీమవరంలో వడ్డిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు, కలెక్టర్ తదితరులు

క్రైం కార్నర్

ఒంటరి జీవితంపై విరక్తి చెంది వృద్ధుడి ఆత్మహత్య

పెంటపాడు, ఆగస్టు 16 : ఒంటరి జీవితంపై విరక్తి చెందిన వృద్ధుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలివి. తాడేపల్లి గూడెం రూరల్ మండలం జగన్నాథపురానికి చెందిన కొయ్యినాడ నూకరాజు (71) భార్య, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. భార్య ఆరేళ్ల క్రితం మృతి చెందింది. కుమార్తెలు ముగ్గురికి వివాహాలు కాగా, కుమారుడు ఇల్లు వదలి బయటకు వెళ్లిపోయాడు. దీంతో ఎవరూ లేని నూకరాజు కొన్ని రోజులు పట్టణంలోని పడాల వృద్ధాశ్రమంలో ఉన్నాడు. అయితే ఇటీవల 15 రోజుల నుంచి తనకు ఆరోగ్యం బాగోపోవడంతో చిన్న కుమార్తె ఇంటికి వెళ్ళాడు. అనంతరం గురువారం అక్కడి నుంచి తన సొంత ఊరు జగన్నాథపురం వెళ్ళి తన బంధువులను, గ్రామస్థులను పలకరించాడు. అదే రోజు అర్ధరాత్రి దాటిన తరువాత మండలంలోని ప్రత్తిపాడు బస్టాండ్ వద్ద ఉరి వేసుకుని మృతిచెందాడు. స్థానికులు సమాచారాన్ని అందించడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ శంకర్ కేసు నమోదు చేశారు.

భార్య మరణంతో కలత చెంది ఆత్మహత్య

ఏలూరు క్రైం, ఆగస్టు 16 : భార్య మరణంతో తీవ్ర కలత చెందిన ఒక వృద్ధుడు జీవితంపై విరక్తి చెంది రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు చాణుక్యపురి కాలనీ ఏటిగట్టు ప్రాంతానికి చెందిన దళాయి కృష్ణ (65)కు భార్య గత ఏడాది మేనెలలో మరణించింది. అప్పటి నుంచి కృష్ణ తీవ్ర మనస్థాపానికి గురై వంటరిగా ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం ఏలూరు శ్రీనివాస థియేటర్ సమీపంలో బ్రిడ్జిపైకి వెళ్ళి రైలు పట్టాలపై నిలబడ్డాడు. అదే సమయంలో కాకినాడ వెళ్ళే ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు రైల్వే ఎస్ఐ సైమన్ సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా నమోదు చేసి మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్యపై హత్యాయత్నం..భర్త అరెస్ట్

ఏలూరు క్రైం, ఆగస్టు 16 : భార్యపై తరచూ అనుమాన పడుతూ ఘర్షణ పడుతున్న భర్త అకస్మాత్తుగా చున్నీతో ఆమె మెడకు బిగించి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఏలూరులోని లంబాడీపేటనకు చెందిన బానోతు శివ ప్రసాద్ తన భార్య కనకదుర్గపై అనుమానం పెంచుకున్నాడు. గొడవలు కూడా జరుగుతున్నాయి. పోలీసులకు ఫిర్యాదు చేయగా కౌన్సెలింగ్ ఇచ్చారు. పెద్దల ద్వారా మాట్లాడుకున్నా అతని అనుమానం పెనుభూతం అవుతుందే తప్ప ఏ మాత్రం పోవడం లేదు. ఈ నెల 15వ తేదీన అకస్మాత్తుగా తన మెడకు చున్నీ చుట్టి హత్య చేయడానికి ప్రయత్నించాడు. ఇరుగు పొరుగు వారు చూసి ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు వన్‌టౌన్ సీఐ రాజశేఖర్ హత్య కేసు నమోదు చేసి శివ ప్రసాద్‌ను అరెస్టు చేశారు.

పాము కాటుతో రైతు మృతి

యలమంచిలి, ఆగస్టు 16: మండలంలోని శిరగాలపల్లి గ్రామానికి చెందిన సజ్జా నాగేశ్వరరావు (53) గురువారం రాత్రి పాము కాటు వేయడంతో మృతి చెందారు. నాగేశ్వరరావు గురువారం సాయంత్రం పొలం వెళ్లి పాలు తీసుకొని ఇంటి వద్దకు వచ్చి బయటకు వెళ్ళాడు. రాత్రి 9 గంటల అయినప్పటికీ ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయడం లేదు. దీంతో బంధువులు గ్రామంలోని నాగేశ్వరరావు ఆచూకీ కోసం గాలించిన అనంతరం పొలం వెళ్లి చూడగా కొబ్బరి తోటలో నోటి వెంట నురగలు వచ్చి విగత జీవిగా పడి ఉన్నాడు. మృతుని కాలుపై పాము గాటు ఉండటంతో పాము కరిచి ఉంటుందని భావిస్తున్నారు.

రోడ్డు పక్కన పడి వ్యక్తి మృతి

భీమవరం క్రైం, ఆగస్టు 16 : మద్యం మత్తులో రోడ్డు పక్కన పడి తలకు గాయాలవగా చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. భీమవరం వన్‌టౌన్ ఏఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలివి.. మొగల్తూరు మండలం కాళీపట్నంకు చెందిన మర్రి భద్రయ్య (60) చేల్లో ఎలుకలు, చేపలు పట్టుకుని జీవిస్తుంటాడు. ఈనెల 12న ఇంటి నుంచి బయటకు వచ్చి అతిగా మద్యం సేవించి దిరుసుమర్రు రోడ్డులో పక్కన పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 సాయంతో భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఈనెల 14వ తేదీ రాత్రి మృతి చెందాడు. అతడి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ తెలిపారు.

పోలీసుల టార్చర్ భరించలేకపోతున్నా..

యువకుడి ఆత్మహత్య.. వైరల్ అవుతున్న సెల్ఫీ వీడియో



ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు

ద్వారకాతిరుమల ఆగస్టు 16 : ద్వారకా తిరుమలలో ఒక యువకుడు ఆత్మహత్య చేసకున్నాడు. ఆత్మహత్యకు ముందు అతను తీసుకున్న సెల్ఫీ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ద్వారకాతిరుమలకు చెందిన పెండ్రాల పోశిబాబు (28) గురువారం రాత్రి కొంగల మందు తిని ఆత్మహత్య చేసుకున్నాడు. తన ఆత్మహత్యకు గల కారణాన్ని సోషల్ మీడియా ద్వారా తెలియపరిచాడు. ఈ వీడియో ప్రసార మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. పోలీసుల టార్చర్ భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పాడు. పుట్టి పెరిగిన నాటి నుంచి పోలీస్ స్టేషన్ గడప తొక్కలేదని పోలీసులు శారీరకంగా మానసికంగా చిత్ర హింసలకు గురి చేశారని, తనను పోలీస్ స్టేషన్‌కి రమ్మంటూ ఇబ్బందులు పెడుతున్నారని కుటుంబ సభ్యుల ముందు తలెత్తుకోలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇదిలా ఉంటే ఆ యువకుడు గ్రామానికి చెందిన ఒక మైనర్ బాలికను వేదిస్తున్నాడని గ్రామానికి చెందిన ఆ బాలిక తల్లి నాలుగు రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయంపై అతడిని పిలిచి పోలీసులు మందలించినట్లు తెలిసింది. మృతుడికి ఒక భార్య, మూడు సంవత్సరాల పాప ఉంది. భార్య గర్భిణి కావడంతో ఏలూరు ఆస్పత్రిలో ఉంది.

భర్తను కడతేర్చిన భార్య

పెదనిండ్రకొలనులో సంఘటన



ఏనుగుపల్లి శ్రీను మృతదేహం

నిడమర్రు ఆగస్టు 16 : భర్త వేధింపులకు తట్టుకోలేక కట్టుకొన్న భార్యే భర్తను కడతేర్చిన సంఘటన పెదనిండ్రకొలనులో చోటు చేసుకొంది. తాగుడుకు బానిసై దొరికినచోటల్లా అప్పులు చేసి కుటుంబాన్ని రోడ్డున పడేస్తున్న కట్టుకొన్న మొగుడు తనపై దాడి చేస్తుంటే చివరకు అతడినే హతమార్చింది. నిడమర్రు ఎస్ఐ వీరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం నిడమర్రు మండలం పెదనిండ్రకొలను గ్రామంలో వైఎస్ఆర్ కాలనీ ఎస్సీ కాలనీలో భార్య భర్తలు నివసిస్తున్నారు. వీరి ఒక కుమార్తె ఉంది. ఆమెకు ఆరునెలల క్రితం వివాహం చేశారు. పెళ్లయిన నాటి నుంచి వారు గొడవలు పడుతున్నారు. శుక్రవారం భార్యభర్తలు ఘర్షణ పడ్డారు. భర్త ఏను గుపల్లి శ్రీను (36) అక్కడే గల గునపం తీసుకొని ఆవేశంలో తాము నివాసం ఉంటున్న రేకుల షెడ్డును కూల్చబోగా భార్య ఝాన్సీరాణి (32) అడ్డువెళ్లి ఆపబోయింది. తనపై గునపంతో దాడి చేయబోయిన భర్త నుంచి గునపం లాక్కొని తిరిగి అతని తలపై బలంగా బాదడంతో శ్రీను అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. భర్తను కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ అతను అప్పటికే చనిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని శ్రీను మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్టు పోలీసులు తెలిపారు.

కుళాయిల్లో మురికి నీరు

» ప్రజారోగ్యంతో పురపాలకం చెలగాటం


కుళాయిలో వచ్చిన మంచినీరు ఇవే..

నరసాపురం, ఆగస్టు 16: ఈ సీసాలో ఉన్న నీరు కుళాయిల్లో వస్తున్న తాగునీరే.. ఎనిమిది రోజులుగా ఇదే మురికి నీరు ప్రజలకు పంపిణీ చేశారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా.. పరిస్థితి మారలేదు, చివరికి ప్రజలు పట్టుకోవడం మానేశారు, ఈ పరిస్థితి సబ్‌డివిజన్ కేంద్రంగా ఉంటున్న నరసాపురం పట్టణంలో.. ఓ మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు నివాసం ఉంటున్న నాలుగో వార్డులోని గానుగ వీధులో ఉంది. ఈ సమస్యను కమిషనర్ వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లగా సోమవారం ఆయనే వచ్చి పరిశీలించారు.. శుక్రవారం సాయంత్రం వరకు సమస్య పరిష్కరం కాలేదు. ఈ వార్డులోని ప్రజలు తహసీల్దార్ కార్యాలయంలో ఉంటున్న పబ్లిక్ ట్యాప్ నుంచి నీళ్లు తెచ్చుకుని వాడుకుంటున్నారు. ఇదే తరహాలో పట్టణంలోని పలు వార్డుల్లో కూడా మురికినీరు సరఫరా అవుతుంది. దీనికి పురపాలక సంఘం అనేక కారణాలు చూపిస్తుంది. ప్రతి కౌన్సిల్ సమావేశంలో ప్రజలు మురికినీరుపై గళం విప్పుతున్నారు. కానీ సిబ్బంది పనితీరులో మాత్రం మార్పు రావడం లేదు. చాలామంది సిబ్బంది స్థానికంగా నివాసం ఉండ కుండా భీమవరం, పాలకొల్లు నుంచి వచ్చి విధులు నిర్వహిస్తున్నారు. ఫిర్యాదులొస్తే తాగునీటి సరఫరా సమయంలో వచ్చి నీటిని పరిశీలించరు.. పేరుకు మాత్రం జిల్లాలో ఏ పురపాలకంలో లేనంత పెద్ద మంచినీటి చెరువు ఉంది. కానీ నీటిని మాత్రం శుద్ధి చేసి సక్రమంగా ప్రజలకు అందించలేక పోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఏఈ సునీల్‌ను వివరణ కోరగా.. తమ దృష్టికి వచ్చి ఐదు రోజులైంది. ఇప్పటి వరకు సిబ్బంది చాలాచోట్ల వెతికారు. ఎక్కడ మురికినీరు కలుస్తోందో అన్న విషయాన్ని శుక్రవారం సాయంత్రం గుర్తించాం శనివారం పరిష్కరిస్తామన్నారు.


ఢిల్లీలో వాజపేయి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న శ్రీనివాసవర్మ


వాజపేయి చిత్రపటానికి పూలమాల వేస్తున్న బీజేపీ నాయకులు

మాజీ ప్రధాని వాజపేయికి ఘన నివాళి

భీమవరంటౌన్/ తాడేపల్లిగూ డెం రూరల్, ఆగస్టు 16 : మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి వర్ధంతి కార్యక్రమంలో సహచర కేంద్ర మంత్రివర్యులతో కలిసి న్యూఢిల్లీలోని సదైవ్ అటల్ మెమోరియల్ పార్క్‌లో ఆయన సమాధి వద్ద కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మపుష్పాంజలి నివాళులర్పించారు. తాడేపల్లిగూడెం బీజేపీ కార్యాలయం వద్ద వాజపేయి చిత్రపటానికి బీజేపీ నాయకులు కోట రాంబాబు, ముప్పిడి సురేష్‌రెడ్డి, కొండపల్లి నరేష్, తదితరులు నివాళులర్పించారు.

విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు


విద్యార్థినికి ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం ఎడ్యుకేషన్, ఆగస్టు 16 : ప్రతిభావంతులను ప్రోత్సహిస్తేనే విద్యలో మరింత రాణిస్తారని, ప్రతీ విద్యార్థి క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు అన్నారు. తుందుర్రు జడ్పీ హైస్కూల్ వ్యవస్థాపకుడు, మాజీ సర్పంచ్ ఆరేటి వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం వారి కుమారుడు తుందుర్రు గ్రామ సర్పంచ్ ఆరేటి వెంకట సత్యవీరస్వామి నాయుడు, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పదో తరగతి (2023-24)లో మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను ఎమ్మెల్యే చేతులమీదుగా అందించారు. పదో తరగతిలో మొదటి స్థానం సాధించిన బెల్లపు భార్గవికి రూ.10వేలు, బెల్లపు ఒజస్వికి రూ.6వేలు, అడ్డాల రామ్‌చరణ్‌తేజకి రూ.4వేలు చొప్పున మొత్తం రూ.20వేలు అందించారు. ఆరేటి కాశీ, మెంటే నాగేశ్వరరావు, కోయ రాంబాబు, కమ్మిల రాము, యర్రంశెట్టి అప్పారావు, ఆరేటి ప్రదీప్, కిషోర్, జితేంద్ర, ప్రధానోపాధ్యాయులు కేఎస్‌సీహెచ్ సాయిరామ్, జె.శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం పనిచేద్దాం.. ఆక్రమణలు వద్దు

» ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు


ఉండిలో పోలీసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘురామ

ఉండి ఆగస్టు 16: 'నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిది ద్దాలనే లక్ష్యం తో ముందుకు వెళ్దాం. అభివృద్ధి కోసం పనిచేద్దాం.. ఆక్రమణలు వద్దు' అని ప్రజలంతా సహకరించాలని ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు సూచించారు. శుక్రవారం ఉండిలో రహదారి పక్కన వున్న ఆక్రమణలను పోలీసుల ఆధ్వర్యంలో అధికారులు తొలగింపు పనులు చేపట్టారు. అ సమ యంలో స్థానిక ఎమ్మెల్యే టీడీపీ నాయకులతో కలిసి బాధితులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ఇళ్ల స్థలాలు లేని వారికి సహకారం అందిస్తాం, రుణాలు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. ఈ నెలకు అద్దె ఇంట్లో ఉండేందుకు ఒక్కొక్క కుటుంబానికి రూ.1500 చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఉండి పంచాయతీ ఈవోపై స్థానికులు దౌర్జన్యం చేయడంపై అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. దౌర్జన్యం చేసిన ఆక్రమణదారులపై కేసు పెట్టినట్టు అధికారులు తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు కరిమెరక నాగరాజు, ముదునూరి కృష్ణంరాజు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు యిర్రింకి బుజ్జి, కరిమెరక శ్రీను, గురుగుబిల్లి సత్యనారాయణ, జనసేన మండల కన్వీనరు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల సమస్యలు పరిష్కరించాలి

తణుకు, ఆగస్టు 16 : సమాజంలో వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర్ చౌదరి కోరారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం తహసీల్దార్ డీవీఎస్ అశోకవర్మకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యదర్శి ఎండీ స్వాలిహా, కోశాధికారి అర్జి భాస్కరరావు, సభ్యులు కృష్ణానందం, సుబ్రహ్మణ్యం, సత్యనారాయణ పాల్గొన్నారు.

హేకథాన్ పోటీల్లో 'ఎస్ఆర్‌కేఆర్' విద్యార్థుల ప్రతిభ

భీమవరం ఎడ్యుకేషన్, ఆగస్టు 16 : ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో క్రీడలకు దోహదపడే యాప్‌లను రూపొందిస్తే వాటి ద్వారా చదువుతో పాటు క్రీడలు మానసిక వికాసం పొందగలరని ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన హేకథాన్ పోటీల్లో విద్యార్థులు రూపొందించిన యాప్‌లు ఇందుకు ఉదాహరణగా నిలుస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో మొదటి సారిగా భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో వేదిక్ విజన్-2024 పేరిట హేకథాన్ నిర్వహించారు. శుక్రవారం కళాశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు ఆధ్వర్యంలో విజేతలకు బహుతులు అందించారు. ఫిజికల్ డైరెక్టర్ డా.పి సత్యనారాయణరాజు, కళాశాల ఉపాధ్యక్షులు ఎస్వీ రంగరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం పునఃనిర్మాణ పనులు ప్రారంభం

ఆచంట, ఆగస్టు 16 : భీమలాపురంలో సచివాలయ నిర్మాణానికి రూ. 35 లక్షలతో చేపట్టిన పనులు గత ప్రభుత్వ హయాంలో మధ్యలో నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం రావడంతో మళ్లీ ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ఆదేశాల మేరకు సచివాలయ భవనాన్ని పునఃనిర్మాణం నిమిత్తం శుక్రవారం సర్పంచ్ గుబ్బల మాధవరావు ఆధ్వర్యంలో ఎంపీపీ దిగుమర్తి సూర్యకుమారి కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుబ్బల మాధవరావు, సెక్రటరీ బి.బాలకృష్ణ, వీఆర్వో చలం తదితరులు పాల్గొన్నారు.




భీమవరం మావుళ్లమ్మ ఆలయంలో భక్తుల రద్దీ.. ఎల్‌బీచర్లలో గంగాలమ్మ.. అలంకరణలో ఆచంట పార్వతి అమ్మవారు

వరలక్ష్మీ నమోస్తుతే..

» భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీవ్రత పూజలు
» కిటకిటలాడిన దేవాలయాలు

భీమవరం టౌన్/పాలకొల్లు అర్బన్, ఆగస్టు 16 :శ్రావణ మాసం పౌర్ణమి ముందుగా వచ్చే శుక్రవారం రోజున మహిళలు వరలక్ష్మీ దేవిని ప్రత్యేకంగా అలంకరించి వరాలను ఇచ్చే కల్పవల్లిగా ఆరాధిస్తారు. ఈ సందర్భంగా శుక్రవారం మహిళలు తమ ఇళ్లల్లో అమ్మవార్లను కలశ రూపంలో ప్రతిష్ఠించుకుని వరలక్ష్మి వ్రతాన్ని ఆచరించారు. ఆలయాలు కిటకిటలాడాయి. భీమవరం మావుళ్లమ్మ ఆలయం, పాలకొల్లు మండలం యడ్ల బజారులోని దుర్గమ్మ ఆలయంలో భక్తులు అమ్మవారికి పూజలు చేశారు. సుమారు మూడు వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. ఈవో ఎన్.సతీష్‌కు మార్, సిబ్బంది చిట్టి రాంబాబు, సత్యనారాయణ, వలంటీర్లు సేవలు అందించారు.

● కాళ్ళ/ఆకివీడు/పాలకోడేరు : కాళ్ళ మండలం కోమటిగుంటలో వున్న శ్రీదుర్గాదేవి అమ్మవారికి శ్రావణ శుక్రవారం సందర్భంగా సుమారు 75 పట్టు చీరలతో అందంగా అలంకరణ చేశారు. ఆలయ ప్రాంగణంలో కుంకుమ పూజల అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. ఆకివీడు పట్టణంలోని మహిళలు వరలక్ష్మి వ్రతం పూజలు నిర్వహించారు. అమ్మవార్ల ఆలయాలు కిటకిటలాడాయి. పాలకోడేరు మండలంలోని పలు గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీదేవికి పూజలు నిర్వహించారు. మండలంలోని గొల్లలకోడేరు, పాలకోడేరు, విస్సాకోడేరు, కుముదవల్లి, శృంగవృక్షం గ్రామాల్లో మహిళలు పూజలతో భక్తిని చాటుకున్నారు

●పెనుగొండ/ఆచంట : పెనుగొండ మండలం వడలిలో వున్న మందాలమ్మ అమ్మవారు శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరలక్ష్మి వ్రత పూజలు అనంతరం అమ్మవారిని గజమాలతో అలంకరించారు. ఆచంట మండలంలోని అమ్మవార్ల ఆలయాల్లో మహిళలు వరలక్ష్మి వ్రత పూజను నిర్వహించారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

● నరసాపురం రూరల్/మొగల్తూరు : నరసాపురం పట్టణ, మండలంలో శుక్రవారం వరలక్ష్మి వత్రాన్ని పురస్కరించుకుని అమ్మవారి ఆలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కనకదుర్గ, పుంతలో ముసలమ్మ, దుర్గాభవాని, వనువులమ్మ, గోగులమ్మ, కొండాలమ్మ, గంటాలమ్మ, ఎల్‌బీచర్ల గ్రామంలోని గంగాలమ్మ అమ్మవార్లను అలకరించారు. ఆలయ ప్రాంగణం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. మొగల్తూరు మండలంలోని మొగల్తూరు భవానీకాలనీలో గల కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● గణపవరం : గణపవరం మండల గ్రామాల్లో, ఆలయాల్లో శుక్రవారం వరలక్ష్మీవ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు తమ ఇళ్లల్లో అమ్మవారి ప్రతిమను సుందరంగా అలంకరించి వరలక్ష్మి వ్రతపూజలను జరుపుకున్నారు.

ఘనంగా ఎమ్మెల్యే బొలిశెట్టి జన్మదిన వేడుకలు

తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 16 : ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పుట్టిన రోజు వేడుకలను మాగంటి కళ్యాణ వేదికలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అభిమానుల సమక్షంలో ఎమ్మెల్యే శ్రీనివాస్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా రాజానగరం జీఎస్ఎల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలువురు రక్తదానం చేశారు. ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలు తనపై చూపించిన అభిమానానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానన్నారు. తన పుట్టిన రోజున అన్నదానం, వైద్య శిబిరాలు, నిత్యావసర సరుకుల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించిన అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి, బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీ, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్ తదితరులు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే తనయుడు బొలిశెట్టి రాజేష్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. కార్యక్రమంలో కిలపర్తి వెంకట్రావు, పరిమి రవికుమార్, పోతుల అన్నవరం, బండి పెద్దిరాజు, బుధన ధనరాజు, దాసరి సతీష్‌కుమార్, కొవ్వూరి లక్ష్మణరెడ్డి, కొవ్వూరి వేణుగోపాల్‌రెడ్డి, చలంచర్ల మురళి, మైలవరపు గోపాలకృష్ణ, రాంలక్ష్మణ్, పసుమర్తి చందు, మద్దుకూరి ధనరాజు, ముత్యాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే బొలిశెట్టికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలుపుతున్న నాయకులు


మాగంటి కల్యాణ వేదిక వద్ద వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది


వల్లూరులో అబ్దుల్‌కలాం విగ్రహం ఆవిష్కరించిన పూర్వ విద్యార్థులు

అబ్దుల్ కలాం విగ్రహం ఆవిష్కరణ

ఆచంట, ఆగస్టు 16 : వల్లూరు హైస్కూలులో 2001లో చదివిన పదో తరగతి పూర్వపు విద్యార్థులు రూ. 60 వేలతో ఏర్పాటు చేసిన మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం విగ్రహాన్ని నాయకులు ప్రారంభించారు. పాఠశాలకు పూర్వపు విద్యార్థులు చేస్తున్న సేవలను కొనియాడారు. జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, వైస్ ఎంపీపీ తాళం శ్రీనివాస్, సర్పంచ్ నేలపూడి బేబి, పూర్వపు విద్యార్థులు గుడాల వెంకట సుబ్బారావు, కాసాని వెంకటకృష్ణ, దొంగ లక్ష్మీనారాయణ, పాతంశెట్టి వెంకటేష్, ఆకెళ్ళ శ్రీసుధ, ఎస్ఎంసీ చైర్మన్ జోగి జాన్సకుమార్, పాఠశాల హెచ్ఎం, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణదారులకు అపరాధ రుసుం

నరసాపురం, ఆగస్టు 16 : పట్టణంలో పురపాలక నింబంధనలు, ప్లాన్‌కు విరుద్ధంగా భవనాలు కట్టిన అక్రమ నిర్మాణదారులకు న్యాయస్థానం అపరాధ రుసుం విధిస్తూ తీర్పు ఇచ్చిందని కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. పట్టణంలో పలు వార్డుల్లో అనధికారిక నిర్మాణాలు కట్టిన నేపథ్యంలో మునిసిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీ చేసినా స్పందించకపోవడంతో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ మేరకు 16వ వార్డులో 2022లో వెంకటసత్యనారాయణకు రూ.1,28,955, 17వ వార్డులో జోగి నాగేంద్రరావుకు రూ.69,500, 9వవార్డులో సూర్యనారాయణరాజుకు రూ.83,420 చొప్పున అడిషనల్ సివిల్ జడ్జి అపరాధ రుసుము విధించారన్నారు.

'ముంపు నీటి సమస్యల పరిష్కారానికి చర్యలు'

మొగల్తూరు, ఆగస్టు 16 : కాళీపట్నం తూర్పు పంచాయతీ పరిధిలో జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న మురుగునీరు, వర్షం ముంపు నీటి సమస్యల పరిష్కారినికి ఏర్పాట్లు చేస్తున్నట్టు తహసీల్దార్ సీహెచ్ విద్యాపతి తెలిపారు. శుక్రవారం ఆ గ్రామ రైతులు, పెద్దలతో ఆయన సమావేశం నిర్వహించారు. 216 జాతీయ రహదారి నిర్మాణంలో తలెత్తిన లోపాల కారణంగా మురుగు బోదె నుంచి ప్రవహించాల్సిన మురుగునీటితో పాటు వర్షం నీరు హైవేపై ప్రవహించడంతో ప్రయాణికులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నట్టు ఆ గ్రామస్థులు, రైతులు కలెక్టర్‌కి ఫిర్యాదు చేశారు. ఆమె ఆదేశాల మేరకు తహసీల్దార్ విద్యాపతి, ఎన్‌హెచ్ అధికారులు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు, గ్రామస్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా త్వరలో సమస్య పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో సర్పంచ్ మేడిద సౌజన్య ప్రభాకర్, ఎంపీటీసీ తణుకుల శ్రీవెంకటదుర్గ, మేడిద బాబ్జి, కవురు పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

పాత గొడవల నేపథ్యంలో దాడి.. కేసు నమోదు

భీమవరం క్రైం, ఆగస్టు 16 : పాత గొడవలు పురస్కరించుకుని కర్రతో దాడి చేసి గాయపర్చారంటూ భీమవరం మండలం చినఅమిరం గ్రామానికి చెందిన మన్నే ఆనంద్‌కుమార్ ఫిర్యాదు చేశాడని ఎస్ఐ రహమాన్ తెలిపారు. ఆనంద కుమార్‌కు సోదరుడు ఉదయ్‌కుమార్‌కు పాత గొడవలు నేపథ్యంలో ఈనెల 15వ తేదీన రాత్రి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతుండగా అంబేడ్కర్ సెంటర్ వద్ద ఉదయ్‌కుమార్ కర్రతో కొట్టి గాయపర్చినట్టు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రహమాన్ తెలిపారు.

పదకొండు మంది జూదరుల అరెస్ట్

భీమవరం క్రైం/యలమంచిలి, ఆగస్టు 16 : వేర్వేరు చోట్ల మొత్తం పదకొండు మంది జూదరులను పోలీసులు అరెస్ట్ చేశారు. భీమవరం మండలం లోసరి గ్రామంలో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేశామని రూరల్ ఎస్ఐ రాజు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.9150 స్వాధీనం చేసుకున్నామని, శనివారం కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు. యలమంచిలి మండలం పెదలంకలో పేకాట శిబిరంపై దాడి చేసి ఏడుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశామని ఎస్ఐ కె. గురవయ్య తెలిపారు. వారి వద్ద నుంచి రూ.6050 నగదుస్వాధీనం చేసుకున్నామని తెలిపారు.



చిరు జన్మదిన వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

నరసాపురం రూరల్, అగస్టు 16: సినీ హీరో చిరంజీవి జన్మదిన వారోత్సవాలు అంజనా పుత్ర చిరంజీవి యువసేన ఆధ్వర్యంలో చేపడుతున్నట్టు చిరు అభిమానులు తెలిపారు. శుక్రవారం చిట్టవరం రాజగోపాలస్వామి ఆలయంలో పోస్టర్‌ను విడుదల చేశారు. తొలి రోజున చిరంజీవి గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 16 నుంచి 22 వరకు మొక్కలు నాటడం, రక్తదాన శిభిరం, మెడికల్‌క్యాంపు, విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు, అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని సంఘ అధ్యక్షుడు పోలిశెట్టి సత్తిబాబు తెలిపారు. పోలిశెట్టి బాబి, అడ్డాల బాబి, కోపల్లి శ్రీనివాస్, గ్రంధి శ్రీనివాస్, హరిబాబు, మాణిక్యాలరావు, కృష్ణ, సూరిబాబు, చెన్నంశెట్టి నాగు, మోహన్, భాస్కర్, విస్సా బుజ్జి, నాగు తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

భీమవరం క్రైం, ఆగస్టు 16 : భీమవరం పట్టణంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని భీమవరం టూటౌన్ సీఐ జి. కాళీచరణ్ హెచ్చరించారు. శుక్రవారం దుర్గాపురం సెంటర్‌తో పాటు, రైల్వేస్టేషన్‌లలో తనిఖీలు చేపట్టి మాట్లాడారు. గంజాయి విక్రయిం చేసేవారు, రవాణా చేసేవారు, తాగేవారిపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా పెట్టి వారికి ప్రతీ ఆదివారం ప్రత్యేక కౌన్సెలింగ్ ఇస్తున్నామన్నారు. అధిక వడ్డీలు ఎవరైనా వసూలు చేస్తే బాధితులు ఫిర్యాదు చేసిన వెంటనే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చర్మకారులందరికీ రుణాలు ఇవ్వాలి

తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 16 : జిల్లాలోని చర్మకారులందరికీ ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు అందజేయాలని చర్మకార సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు యందం గాంధీ అన్నారు. శుక్రవారం చర్మ కార సేవా సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం బాబూ జగ్జీవనరామ్ విగ్రహానికి నివాళులర్పించారు. అధ్యక్షుడిగా కిల్లాడి సంజీవ్, ఉపాధ్యక్షుడిగా గొట్టేటి ఏసు, సభ్యులుగా ఆనంద్, మహంకాళిరావు, సారయ్య, ముత్యాలరాజు తదితరులు ఎన్నికైనట్లు జిల్లా అధ్యక్షుడు గాంధీ తెలిపారు.

విద్యార్థినులకు అభినందనలు

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 16 : స్థానిక బీవీఆర్ఎం గరల్స్ హైస్కూల్లో ఈ ఏడాది టెన్త్ పరీక్షల్లో ఉత్తీర్ణులై ఐఐటీలో సీట్లు సాధించిన తొమ్మిది మంది విద్యార్థినులకు పట్టణానికి చెందిన వ్యాపారి పొట్నూరి అప్పన్న అభినందించారు. శుక్రవారం హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో వారిని సత్కరించి, ఒకొక్కరికి రూ.1000 చొప్పన నగదు ప్రోత్సాహక బహుమతులను, గ్రామర్ పుస్తకాలను తన తల్లిదండ్రులు సూర్యనారాయణ, లక్ష్మీ జ్ఞాపకార్థం అందించారు. హెచ్ఎం వై.ప్రభాకరశాస్త్రి, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

27న.. చీరల సేకరణ, ఫలసాయం వేలం

నరసాపురం టౌన్, ఆగస్టు 16 : పట్టణంలోని కొండాలమ్మ అమ్మవారికి సమర్పించిన చీరల సేకరణకు ఈనెల 27న వేలం నిర్వహిస్తున్నట్టు ఈవో పి. వేణుగోపాలరావు తెలిపారు. పాటలో పాల్గొనదల్చిన వారు రూ.500 ధరావత్తు చెల్లించాలన్నారు. రాజగోపాలస్వామి దేవస్థానంకు చెందిన చినమామిడిపల్లిలో 17 సెంట్ల మెరక భూమిలో ఉన్న ఐదు కొబ్బరి చెట్లు, ఒక చింతచెట్టు ఫలసాయం హక్కుకు అదేరోజున వేలం పాట నిర్వహిస్తున్నామన్నారు. వేలంలో పాల్గొనదల్చినవారు రూ.1000 దరావత్తు చెల్లించాలని ఈవో తెలిపారు.

నేడు కాగడాల ప్రదర్శన

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 16 :బంగ్లాదేశ్‌లో మైనార్టీలైన హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా శనివారం రాత్రి ధర్మపరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు పరిరక్షణ సమితి అధ్యక్షుడు గాదె వెంకన్న శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాగడాల ప్రదర్శన గాంధీ బొమ్మల సెంటర్‌లో ప్రారంభమై మొయిన్‌రోడ్డు మీదుగా కొనసాగుతుందన్నారు. అందరూ పాల్గొనాలని సమితి అధ్యక్షుడు గాదె వెంకన్న, కార్యదర్శి తోట రాంబాబు, కోశాధికారి శీరం ఆనంద కృష్ణ పిలుపునిచ్చారు.

మనస్తాపంతో కాల్వలోకి దూకిన మహిళ

కాపాడిన జనసైనికులు

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 16: భర్తతో గొడవపడి మనస్తాపంతో ఓ మహిళ కాల్వలో దూకడం గమనించిన జనసేన నాయకులు కాపాడిన ఘటన తాడేపల్లిగూడెం పట్టణంలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలివి.. చినతాడేపల్లికి చెందిన కల్లి మరియమ్మ తన భర్తతో పనికి వెళ్లే విషయంలో గొడవ పడడంతో భర్త తన మాట వినడంలేదన్న మనస్తాపంతో తాడేల్లిగూడెం ఫ్లైఓవర్ వద్దకు వచ్చి కాల్వలోకి దూకింది. ఇది గమనించిన భర్త కల్లి దుర్గాప్రసాద్ తన భార్య కాల్వలోకి దూకిందని కేకలు వేయడంతో అటుగా వెళ్తున్న మారంపల్లికి చెందిన జన సైనికులు అక్కడే ఉన్న తాడు సాయంతో కాల్వలోకి దూకి రక్షించి బయటకు తీసుకొచ్చారు. బయటకు తీసుకువచ్చిన మహిళకు సపర్యలు చేసి పోలీసులకు అప్పగించారు. రూరల్ పోలీసులు దంపతులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మహిళను కాపాడిన జన సైనికులు మిరియాల విజయ్‌కుమార్, రామిశెట్టి అప్పారావు, తోట నాగరాజు, వీఆర్వో తలారి రవీంద్రబాబును స్థానికులు అభినందించారు.


మహిళను కాల్వ నుంచి బయటకు తీస్తున్న జనసైనికులు

మరింత తగ్గిన గోదావరి


కోడేరు పుష్కర ఘాట్ వద్ద వరద నీరు

ఆచంట, ఆగస్టు 16 :గోదావరి ఉధృతి మరింత తగ్గడంతో మండలంలో ఉన్న పుష్కరఘాట్‌లు బయటపడుతున్నాయి. ఈ పుష్కరఘాట్‌లు అన్నీ కూడా మట్టితో కప్పబడి ఉన్నాయి. గోదావరి తగ్గడంతో గోదావరిలో పడవలు రాకపోకలు యథావిధిగా సాగుతున్నాయి. గోదావరి పూర్తిగా తగ్గిన వెంటనే పుష్కరఘాట్‌లలో ఉన్న మట్టిని తొలగించి శుభ్రం చేయాలని పలువురు కోరుతున్నారు.

వెంపను సందర్శించిన సీబీఐ మాజీ జేడీ


వెంపలో మాట్లాడుతున్న జేడీ లక్ష్మీనారాయణ

భీమవరం ఎడ్యుకేషన్, ఆగస్టు 16 : ప్రతీ గ్రామం ఆదర్శ గ్రామంగా ఉండాలని తాను కోరుకుంటూ ముంబై యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేస్తున్నానని సీబీఐ మాజీ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ తెలిపారు. వెంప గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించారు. తొలుత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం కనక ముత్యాల అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపి, సూపర్‌మార్కెట్, సొసైటీ, సచివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కొన్ని గ్రామాలు మాత్రమే ఆదర్శ గ్రామాలుగా ఎంపిక అవుతున్నాయన్నారు. అటు తెలంగాణ, ఇటు ఆంధ్రప్రదేశ్‌లో ఆదర్శ గ్రామాలుగా ఎంపికైన కొన్ని గ్రామాలను సందర్శించి అక్కడ ఉన్న పరిస్థితులను తెలుసుకుని వాటిపై నివేదిక తయారు చేసి ముంబై వర్సిటీకి, ప్రభుత్వాలకు పంపడం జరుగుతుందన్నారు. ఐక్యతగా గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవడంలో వెంప గ్రామ ప్రజలు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని వారిని అభినందించారు.

నులి పురుగుల నివారణ పోస్టర్ ఆవిష్కరణ

పాలకొల్లు రూరల్, ఆగస్టు 16: స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో సంగాని వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నివారణ పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లంకలకోడేరు పీహెచ్‌సీ డాక్టర్ ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ ఈనెల 20న లంకలకోడేరు పీహెచ్‌సీ పరిధిలోని అన్ని జడ్పీ, ఎంపీపీ, యూపీ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని 19 ఏళ్ళ లోపు విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. ఎంఈవో గంగాధర శర్మ, ఈవోపీఆర్‌డీ కేఎం వైభావతి, ఏవో గోవిందరాజులునాయుడు, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పంచాయతీ కార్యదర్శులు, పీహెచ్ఎన్ పి. ఎలిజబెత్, సూపర్‌వైజర్లు డి.కమల, ఎస్కే అమలేశ్వరరావు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాలు పాల్గొన్నారు.

మళ్లీ సెల్ టవర్ ఎక్కి హల్‌చల్

భీమవరం క్రైం, ఆగస్టు 16 : భీమవరం వన్‌టౌన్‌లోని బుధవారం మార్కెట్ కూడలిలో వున్న సెల్ టవర్‌పైకి బి.వసంతరావు అనే వ్యక్తి శుక్రవారం ఎక్కాడు. చాలాసేపు కిందకు దిగకపోవడంతో పోలీసులు, అగ్నిమాపక తదితర శాఖల అధికారులు అప్రమత్తం అయ్యారు. విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో పట్టణంలో అంధకారం నెలకొంది. కొద్దిసేపటికి కిందకు దిగిరాగా పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్ళారు. గతంలో ఇదే టవర్‌పైకి అతడు ఐదు సార్లు ఎక్కడంతో టవర్ చుట్టూ ముళ్లకంచె వేయించారు. అయినా వాటిని తప్పించుకుని మళ్లీ టవరెక్కడం గమనార్హం. ఇప్పుడు ఎందుకు ఎక్కావని అడిగితే సమాధానం చెప్పడం లేదని స్థానికులు అన్నారు.

ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేయడం అవాస్తవం

భీమవరం క్రైం, ఆగస్టు 16 : గత ప్రభుత్వం ఆరోగ్యశ్రీ సేవల బకాయిలు నిలిపివేయడంతో అప్పట్లోనే కొన్ని ఆసుపత్రులు సేవలు నిలిపివేశాయి. మళ్లీ బకాయిలు చెల్లిస్తాం అని చెప్పడంతో ప్రారంభమయ్యాయి. ఇటీవల బకాయిలు కోసం ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తున్నరంటూ ప్రచారం పెద్దఎత్తున ప్రచారం జరుగుతుంది దీనిపై జిల్లా ఆరోగ్యశ్రీ సేవల అధికారి కీర్తి మాట్లాడుతూ జిల్లాలో ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తున్న 32 ఆసుపత్రులలో ఎటువంటి సేవలు నిలిపివేయడం లేదని తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవోలు

పాలకొల్లు రూరల్/ఆకివీడు, ఆగస్టు 16 :సార్వత్రిక ఎన్నికల బదిలీల్లో భాగంగా తూర్పుగోదావరి జిల్లా ఆత్రేయపురం మండలానికి బదిలీ అయి వెళ్ళిన సంగాని వెంకటేశ్వరరావు ఎన్నికల అనంతరం తిరిగి పాలకొల్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆకివీడు మండల ఎంపీడీవోగా కందుల వాణి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో వై.రామకృష్ణ కృష్ణాజిల్లాకు బదిలీపై వెళ్లారు.

ఉద్యోగ సంఘాల కోసం పోరాడేది ఏపీజీఈఏ

ఆకివీడు, ఆగస్టు 16 :ఉద్యోగ సంఘాల కోసం నిరంతరం పోరాడేది ఏపీజీఈఏ అని ఆకివీడు తాలూకా కార్యదర్శి నేతల ప్రకాష్‌బాబు అన్నారు. ఏపీజీఈఏ గుర్తింపు పొందిన దినోత్సవం సందర్భంగా శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు జి.చిట్టిబాబు, తహసీల్దార్ నందూరి వెంకటేశ్వరరావు, డీటీ ఫరూఖ్, ఏవో ప్రియాంక తదితరులు ఉన్నారు.

ఎస్ఈబీ అదనపు ఎస్పీ బదిలీ

ఏలూరు క్రైం, ఆగస్టు 16: పశ్చిమ గోదావరి జిల్లా ఎస్ఈబీ అదనపు ఎస్పీగా పని చేస్తున్న ఏటీవీ రవికుమార్‌ను ఇంటెలిజెన్స్ అదనపు ఎస్పీగా బదిలీ చేశారు. గత సార్వత్రిక ఎన్నికలకు ముందు జిల్లాకు బదిలీపై వచ్చారు.

రంగసాయికి ఉత్తమ సామాజిక కార్యకర్త అవార్డు



భీమవరం టౌన్, ఆగస్టు 16 : స్వాతంత్ర్య వేడుకలలో ఉత్తమ సామాజిక కార్యకర్తగా సమాజంలో సేవలందిస్తున్న చెరుకువాడ రంగసాయికి జిల్లా కలెక్టర్ నాగరాణి, రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు, ఎస్పీ నయీం అస్మి చేతులమీదుగా అవార్డు అందించారని రంగసాయి తెలిపారు.

నేడు స్వాతంత్ర్య వేడుకల ముగింపు

భీమవరం క్విట్ ఇండియా స్థూపం వద్ద 78వ స్వాతంత్ర్య ముగింపు వేడుకలు ఈనెల 17వ తేదీన నిర్వహిస్తున్నట్లు కార్యక్రమం కన్వీనర్ చెరుకువాడ రంగసాయి తెలిపారు. కార్యక్రమానికి కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు హాజరవుతారన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల ప్రాంతాలు

ఆచంట/పెనుగొండ/తణుకు, ఆగస్టు 16 : ఆచంట, వల్లూరు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం పలు గ్రామాల్లో శనివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నామని ఈఈ బి.సురేశ్‌కుమార్ తెలిపారు. ఆచంట మండలంలో రావిగుంట, బాలంవారిపాలెం, శేషమ్మచెరువు, వెన్నపువారిపాలెం, పద్మనాభుని చెరువులకు, వల్లూరు సబ్ స్టేషన్ పరిధిలో వల్లూరు లోకల్, నీరుళ్ళపాలెం, కాంబట్లపాలెం, పోడూరు మండలం వద్దిపర్రు గ్రామస్థులు సహకరించాలన్నారు. పెనుగొండ మండల పరిధిలోని పెనుగొండ, వడలి, కొఠాలపర్రు, సోమరాజుచెరువు గ్రామాలకు సరఫరా నిలిపివేస్తామన్నారు. తణుకు, పైడిపర్రు సబ్ స్టేషన్ల పరిధిలోని వేల్పూరు రోడ్, భాష్యం స్కూలు నుంచి గోస్తనీ ఏరియా, వెంకట్రాయపురం ఏరియా, వేల్పూరు, మండపాక, పెదపాటి చెర్వు, పైడిపర్రు, హౌసింగ్ బోర్డు కాలనీ, కావలిపురం, రేలంగి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని డీఈఈ సీహెచ్ రామకృష్ణ తెలిపారు.

● తాడేపల్లిగూడెం రూరల్ : విద్యుత్ సబ్ స్టేషన్ల మరమ్మతుల నిమిత్తం తాపల్లిగూడెం పట్టణం, మండలంలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపివేస్తామని ధికారులు తెలిపారు. పట్టణంలోని పీఅండ్‌టీ కాలనీ, వివేకానంద బొమ్మ, డీఎస్ చెరువు, 3వ వాటర్ ట్యాంకు ఏరియాలతో పాటు కడియద్ద, ఆరుగొలను గ్రామాలకు ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, వెంకట్రామన్నగూడెంలో ఉదయం పది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు.

● కాళ్ళ : కాళ్ళ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో శనివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం పన్నెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. మండలంలో పెదఅమిరం, కోపల్లె, వేంపాడు, కాళ్ళ కోలనపల్లి గ్రామస్థులు సహకరించాలని కోరారు.